సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

ఆదివారం | 16 | మార్చి | 2025



ఉద్యాన పంటల వైపు మొగ్గు చూపాలి
రైతులు సంప్రదాయ పంటలు కాకుండా ఉద్యాన పంటలు సాగుచేయాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి సంగీతలక్ష్మి సూచించారు. - 8లో▸



ప్రభల తరలింపులో ఉద్రిక్తత
వరంగల్ జిల్లా గీసుకొండ మండలం కొమ్మాల జాతరకు వివిధ గ్రామాల నుంచి రాజకీయ ప్రభలు పోటాపోటీగా తరలివచ్చాయి. దీంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. - 8లో▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
39^0 /22^0
జిల్లాలో ఉదయం నుంచి ఎండ ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఉక్కపోత ఎక్కువ ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.



న్యూస్‌రీల్

ముసాయిదాను వెనక్కి తీసుకోవాలి



కేయూ క్యాంపస్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూజీసీ నూతన ముసాయిదాను వెనక్కి తీసుకోవాలని టీపీటీఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి కడారి భోగేశ్వర్ డిమాండ్ చేశారు. శనివారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో.. కేయూ దూర విద్యాకేంద్రంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 2020 యూజీసీ ముసాయిదాను వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీడీఎస్‌యూ జాతీయ నాయకులు పి.మహేశ్, పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేశ్, కోశాధికారి పవన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మంద శ్రీకాంత్, బీసీ విద్యార్థి సంఘం నాయకులు నాగరాజు, పీడీఎస్‌యూ నాయకులు గణేశ్, పండు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట అర్బన్: హనుమకొండ జిల్లాలో వెనుకబడిన తరగతుల నిరుద్యోగ యువతకు మోటార్ డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రాంరెడ్డి శనివారం తెలిపారు. అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హెచ్ఎంవీ (హెవీ మోటర్ వెహికిల్), ఎల్ఎంవీ(లైట్ మోటర్ వెహికిల్) డ్రైవింగ్ శిక్షణను టీజీఆర్టీసీ సౌజన్యంతో తెలంగాణ వెనుకబడిన తరగతుల సహకార సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువత ఈనెల 31 లోపు హనుమకొండ కలెక్టరేట్‌లోని బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నేడు అటల్ జీ యాదిలో ఆత్మీయ సమ్మేళనం

హన్మకొండ: మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా.. ఈనెల 16న 'అటల్ జీ యాదిలో ఆత్మీయ సమ్మేళనం' నిర్వహిస్తున్నట్లు బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోశ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటలకు హనుమకొండ హంటర్ రోడ్‌లోని డీ కన్వెన్షన్ మినీ హాల్‌లో ఈ సమ్మేళనం జరుగుతుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఆయన తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అటల్ బీహారీ వాజ్‌పేయి అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మైక్రో ఫైనాన్స్ వలలో మహిళలు

కలెక్టర్‌ను కలిసే యోచనలో కడిపికొండవాసులు

కాజీపేట అర్బన్: మండలంలోని కడిపికొండ గ్రామంలో నిరుపేద కుటుంబాలు మైక్రోఫైనాన్స్ వలలో పడి కొట్టుమిట్టాడుతున్నాయి. గ్రామంలో సుమారు 10 వేల జనాభా ఉండగా.. 500 మంది మహిళలు మైక్రో ఫైనాన్స్ బాధితులుగా ఉన్నట్లు తెలుస్తోంది. వారం వారం కట్టాల్సిన చిట్టీలు కట్టలేకపోతుండడంతో మైక్రోఫైనాన్స్ సిబ్బంది మహిళలపై, వారి కుటుంబ సభ్యులపై వేధింపులకు పాల్పడుతున్నట్లు బాధితులు పేర్కొంటున్నారు. చిన్న బ్యాంకులు, ప్రైవేట్ మైక్రోఫైనాన్స్ సంస్థల నిర్వాహకులు రుణం తీసుకున్న వారి ఇంటికి సాయంత్రం, రాత్రి పూట వెళ్తున్నట్లు.. రాత్రి వేళల్లో ఇళ్లకు రావొద్దని బాధితులు సిబ్బందిని వేడుకుంటున్నట్లు తెలిసింది. కాగా.. కేవలం ఆధార్ కార్డే ప్రామాణికం కావడంతో, ఎలాంటి ష్యూరిటీ సంతకం అవసరం లేకపోవడంతో మహిళలు ముందు ఒక సంస్థ నుంచి రుణం తీసుకుంటున్నారు. ఆ అప్పు, వడ్డీ కట్టలేక 5 నుంచి 6 మైక్రో ఫైనాన్స్ సంస్థల నుంచి రుణం పొందుతున్నారు. చివరికి అసలు, వడ్డీ చెల్లించేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. కాగా.. మహిళలు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం.

మజారే.. మండి బజారే!



శనివారం రాత్రి మండిబజార్‌లో కిక్కిరిసిన జనం

ముక్కుపుటాలదిరేలా మాంసాహార వంటకాలు. మనసుకు హత్తుకునేలా అత్తరు సువాసనలు.. చూపుతిప్పనివ్వని బ్యాంగిల్లు. ఆహార్యానికి అందం తెచ్చే కుర్తా పైజామాలు. మిరుమిట్లు గొలిపేలా విద్యుత్ కాంతులు. అవన్నింటికీ కేరాఫ్ మన మండి బజార్. నగరానికి ఐకాన్‌గా నిలుస్తున్న ఈ ప్రాంతం ఓ మినీ చార్మినార్. రంజాన్ వేళ రాత్రి సైతం రద్దీగా ఉండే ఈ ప్రాంతంపై 'సాక్షి' సండే స్పెషల్.

- సాక్షి, వరంగల్

నగరానికి ఓ ఐకాన్‌గా ఈ ప్రాంతం

- విద్యుత్ వెలుగుల్లో నైట్ షాపింగ్
- రంజాన్ సీజన్‌లో హలీమ్, హరీస్ రుచులకు ఫిదా..
- సాయంత్రం 6 నుంచి ఉదయం 5 వరకు రద్దీ..
- ప్రత్యేక ఆకర్షణగా గాజులు, కుర్తా పైజామాలు, సెంట్లు

సండే స్పెషల్

వరంగల్‌లోని మండిబజార్‌లో సాయంత్రం ఆరు గంటలు దాటితే ఇఫ్తార్‌విందుతో సందడి మొదలవుతుంది. ఈ నైట్ బజార్‌లో మరుసటి రోజు తెల్లవారు జామున 5 గంటలు (సహర్ టైమ్) వరకు జనం రద్దీతో కిటకిటలాడుతోంది. ఉపవాస దీక్షలు ప్రారంభమైన రోజు నుంచి ఇప్పటివరకు అనేక స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఈనెల 31న రంజాన్ కావడంతో అప్పటి వరకు ఈనైట్ బజార్ అందుబాటులో ఉండనుంది. అలంకార వస్తువులతో సహా అన్ని వెరైటీలు ఇక్కడ లభిస్తాయి. ఈసారి సరికొత్త సరకుతో ముందుకు వచ్చినట్లు దుకాణాదారులు చెబుతున్నారు. మిరుమిట్లు గొలిపే కాంతుల్లో.. వేసవిలో రాత్రి పూట వచ్చే చల్లగాలుల మధ్య.. మండి బజార్ వద్ద రాత్రిపూట షాపింగ్ చేస్తుంటే.. వచ్చే మజాయే వేరంటూ కస్టమర్లు తమకు కావాల్సిన వస్తువులు కొనుక్కుంటున్నారు. ఈసారి ధరలు కూడా చాలా తక్కువగా ఉన్నాయని సంబురపడుతున్నారు.

నోరూరిస్తున్న రంజాన్ స్పెషల్స్..

రంజాన్ సమయంలో మండిబజార్‌లో దొరికే తినుబండారాలకు ప్రత్యేకత ఉంది. ముఖ్యంగా పత్తర్ కా ఘోష్, మరగ్, పాయా, హలీం, అచార్ కా ఘోష్, బోటి కబాబ్, ఫిష్ కబాబ్, చికెన్-65, చికెన్ మెజెస్టిక్ వంటి మాంసాహార వంటకాలు ఆ ప్రాంతం నుంచి మనల్ని కదలకుండా చేస్తాయి. చికెన్ రోల్, 65 రోల్, మెజెస్టిక్, స్టిక్ చికెన్, బంజారా చికెన్, కేఎఫ్‌సీ చికెన్, మటన్ హలీమ్, చికెన్ హరీస్, చికెన్ బిర్యానీ, మటన్ బిర్యానీ, అతారీ చికెన్, మల్లై చికెన్, సాదిక్ ముర్గీ వంటకాలు నోరూరిస్తున్నాయి. వీటితో పాటు పలు రకాల మిఠాయిలు ఆహారప్రియుల నోరూరిస్తున్నాయి. సోరకాయ స్వీట్, డబుల్‌కమీటా, బాదమ్‌కా కీర్, గుమ్మడికాయ స్వీట్లు తెగ తినేస్తున్నారు. కాజు, బాదం, పిస్తాలు కలిపి తయారుచేసే సర్ప్రైజ్ పుటింగ్ కేక్, ఐస్క్రీమ్‌లు ఇక్కడ ప్రత్యేకం అని దుకాణాదారులు చెబుతున్నారు. అలాగే మహబత్‌కా షర్బత్ (పాలలో పుచ్చకాయ రసం మిక్స్ చేస్తారు)కు కూడా ఆహారప్రియులు ఫిదా అవుతున్నట్లు చెబుతున్నారు.



పేరు ఎలా వచ్చిందంటే..

1970కి ముందు చాలా సంవత్సరాలు ఇక్కడ జంతువుల పచ్చి తోలును కొనేందుకు 70 నుంచి 80 మండీలు ఉండేవి. ఉమ్మడి వరంగల్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా ఇక్కడికి వచ్చి వ్యాపారులకు పచ్చి తోలు అమ్మేవారు. ఇక్కడి నుంచి వీరు ఈ తోలును మద్రాసుకు పంపేవారు. అక్కడ క్లైనింగ్ చేసి కెమికల్స్ మిక్స్ చేసి మార్కెట్లో విక్రయించేవారు. కాలక్రమంలో వరంగల్ నగరం అభివృద్ధి బాట పట్టడంతో 1976 నుంచి వ్యాపార దుకాణాలు అంటే బ్యాంగిల్ స్టోర్, వస్త్ర దుకాణాలు, చెప్పుల దుకాణాలు, హోటళ్లు వెలిశాయి. గతంలో వరంగల్ చౌరస్తా నుంచి పోచమ్మ మైదాన్ వరకు వేసిన రోడ్డుకు ముకురం జాహీ (ఉస్మాన్ రాజు మనవడి పేరు) రోడ్డు అని పేరు పెడితే, ఆ తర్వాత జయప్రకాశ్ నారాయణ (జేపీఎన్) రోడ్డుగా మార్చారు. అయినప్పటికీ జేపీఎన్ మండి బజారుగానే ఇప్పటికీ పిలుస్తున్నారు.

ఆకట్టుకుంటున్న వెరైటీలు



మహిళల షాపింగ్ కోసం మండిబజార్‌లో ప్రత్యేక దుకాణాలు వెలిశాయి. ఢిల్లీ, ఆగ్రాల నుంచి బ్రైడల్ వెడ్డింగ్ వియర్ చీరలు, కుర్తా పైజామాలు ఆకట్టుకుంటున్నాయి. డ్రెస్ మెటీరియల్స్, పట్టు శారీస్, రెడీమేడ్, కిడ్స్‌వేర్, బ్యాంగిల్స్, చెప్పులు, జ్యువెల్లరీ వంటివి ఇక్కడ లభిస్తున్నాయి. రంజాన్ నెలలో సంప్రదాయబద్ధంగా ఉపయోగించే సుర్మా టోపీలు, సుగంధ ద్రవ్యాలు, అత్తరులు, ప్రత్యేక దుస్తులు, కుర్తా పైజామా వంటి వాటికి గిరాకీ పెరుగుతోంది. అలాగే మహిళలు విభిన్న డిజైన్లతో కూడిన గాజులు, ముత్యాలు కొనేందుకు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. పిల్లలు, యువతకు సంబంధించిన వెరైటీ దుస్తులు కూడా అందుబాటులో ఉండడంతో షాపింగ్ చేస్తున్నారు.

20 ఏళ్లుగా వ్యాపారం చేస్తున్నా..



మండిబజార్‌లో కుర్షీద్ హోటల్ స్థాపించి 20 ఏళ్లుగా వ్యాపారం సాగిస్తున్నాం. రంజాన్‌లో ఉపవాసం ఉండే ముస్లింలకు తక్కువ ధరకే హలీమ్, హరీస్‌తో పాటు బిర్యానీ అందిస్తున్నాం. ఈ మాసంలో ఎక్కువ మంది పేద ప్రజలకు సేవా కార్యక్రమాలు అందిస్తాం. - కుర్షీద్, బిర్యానీ హోటల్ వ్యాపారి

మినీ చార్మినార్‌లా మండిబజార్



రంజాన్ నెలలో మండిబజార్ మినీ చార్మినార్‌లా కనిపిస్తుంది. సాయంత్రం ఉపవాసం ముగిశాక బిర్యానీ, హలీమ్, హరీస్, జ్యూస్ వంటి అన్ని రకాల ఆహారపదార్థాలు లభ్యమవుతాయి. రాత్రి వేళలో మండిబజార్ ప్రత్యేక శోభను సంతరించుకుంటుంది. - పాషా, వినియోగదారుడు

ప్రత్యేక ఏర్పాట్లు చేస్తాం..



రంజాన్‌లో ఒక్క ముస్లింలకే కాకుండా హిందువులు సైతం ఈ ప్రాంతంలో ప్రత్యేక షాపింగ్ చేస్తుంటారు. రాత్రి 9 గంటల నుంచి తెల్లవారుజాము వరకు ఇక్కడ సందడిగా ఉంటుంది. హైదరాబాద్‌లో తర్వాత మండిబజార్‌లో అన్ని రకాల వసతులు లభించేలా మండి మర్చంట్ అసోసియేషన్ కృషి చేస్తోంది. - మహమ్మద్ షర్బత్, మర్చంట్ అసోసియేషన్ కోశాధికారి





మండిబజార్‌లో షాపింగ్ చేస్తున్న నగరవాసులు

'సీఎం కృతజ్ఞత సభ'కు సర్వం సిద్ధం

నేడు ఘన్‌పూర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన

- రూ.700 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- మహిళా సంఘాలకు రూ.100 కోట్ల రుణాలు..
- వ్యవసాయ మార్కెట్ సమీపంలో బహిరంగ సభ
- ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎమ్మెల్యే కడియం, ఎంపీ కావ్య, అధికారులు



సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కావ్య, చిత్రంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా, సీపీ సన్‌ప్రీత్ సింగ్, పక్కన డీసీపీ రాజమహేంద్రనాయక్



సిద్ధమైన బహిరంగ సభావేదిక

జనగామ: జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నేడు(ఆదివారం) పర్యటించనున్నారు. రూ.700 కోట్ల వ్యయంతో చేపట్టే పనులకు వర్చువల్‌గా శంకుస్థాపనలు, అలాగే ప్రారంభోత్సవాలు చేయనుండగా.. సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులకు రూ.100 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కులను సీఎం చేతుల మీదుగా అందజేయనున్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ సమీపాన 'సీఎం కృతజ్ఞత సభ'కు సర్వం సిద్ధం చేశారు. బహిరంగ సభతోపాటు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవ ఏర్పాట్లను ఎమ్మెల్యే కడియం శ్రీహరి నేతృత్వంలో సీపీ సన్‌ప్రీత్ సింగ్, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, ఎంపీ కడియం కావ్య శనివారం పరిశీలించారు.

శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలు

జఫర్‌గఢ్ మండలం కోణాయచలం సమీపాన రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్(గురుకులం) కాంప్లెక్స్, రూ.146 కోట్లతో ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి నవాబుపేట వరకు మెయిన్ కెనాల్ లైనింగ్, రూ.46 కోట్ల వ్యయంతో ఘన్‌పూర్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపాన 100 పడకల ఆస్పత్రి, రూ.26 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెవెన్యూ డివిజనల్ ఆఫీస్ (ప్రభుత్వ కార్యాలయాల సముదాయం), రూ.50 కోట్లతో పంచాయతీరాజ్ రహదారులు, రూ.26 కోట్లతో అంతర్గత సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, రూ.250 కోట్లతో ఇందిరమ్మ ఇళ్ల(మొదటి విడత) నిర్మాణ పనులను సీఎం వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు రూ.100 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కులు అందజేస్తారు. అనంతరం సీఎం మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన పలు స్టాళ్లను సందర్శిస్తారు. అలాగే.. ఇందిరా మహిళా శక్తి పథకం కింద మహిళలకు మంజూరైన నాలుగు ఆర్టీసీ బస్సులను ప్రారంభిస్తారు. శంకుస్థాపనలకు సంబంధించి సభా వేదిక సమీపంలోనే ఒకే చోట శిలాఫలకాలు ఏర్పాటు చేశారు. వీఐపీ, వీవీఐపీలకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు.

రెండు రూట్లలో తరలింపు..

సభకు ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో 50 వేల మందిని తరలించనున్నారు. ఇందుకు సంబంధించి వేలేరు, ధర్మసాగర్, స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు మండలాల నుంచి వచ్చే వారు ఘన్‌పూర్ టౌన్ మీదుగా.. జఫర్‌గఢ్, లింగాలఘణపురం, రఘునాథపల్లి మండలాల వారు ఇప్పగూడెం మీదుగా రానున్నారు. ఈరెండు రూట్లలో పోలీసుల నిఘా ఉంటుంది. శివునిపల్లి వ్యవసాయ మార్కెట్, విశ్వనాథపురం సమీపంలో రెండు చోట్ల పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. మూడు రోజులుగా బాంబ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు చేస్తుండగా.. స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్ వర్గాలు నిరంతరం నిఘా ఉంచాయి. సీఎం పర్యటన నేపథ్యంలో 850 మంది పోలీసులతో బందోబస్తు చేపట్టనున్నారు.

సీఎం టూర్ షెడ్యూల్ ఇలా..

- మధ్యాహ్నం 12.10 గంటలకు ఇంటినుంచి (హైదరాబాద్‌లో) బయల్దేరి బేగంపేట విమానాశ్రయం చేరుకుంటారు.
- 12.25 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరుతారు.
- ఒంటి గంటకు స్టేషన్‌ఘన్‌పూర్ మండలం శివునిపల్లి హెలిపాడ్‌కు చేరుకుంటారు.
- 1.10 నుంచి 1.20 గంటల వరకు ఇందిర మహిళా శక్తి స్టాళ్లను పరిశీలించి, వివిధ గ్రూపులకు కేటాయించిన బస్సులను ప్రారంభిస్తారు.
- 1.25 గంటల నుంచి 3 గంటల వరకు శివునిపల్లిలో ప్రజాపాలన కార్యక్రమాలు, కృతజ్ఞత సభలో పాల్గొంటారు.
- 3.10 గంటలకు శివునిపల్లి హెలిపాడ్ నుంచి బయల్దేరి 3.45 గంటలకు హెలికాప్టర్‌లో బేగంపేట విమానాశ్రయం చేరుకుంటారు.

'స్టేషన్' అభివృద్ధికి రూ.800 కోట్లు
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

సీఎం రేవంత్‌రెడ్డి సభను అడ్డుకుంటాం..
- మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

- 8లో▸

తడి, పొడి చెత్తను నిత్యం సేకరించాలి..

వరంగల్ చౌరస్తా: ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. శనివారం హనుమకొండ 57వ డివిజన్‌లోని ఎన్‌జీఓస్ కాలనీలో కమిషనర్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. రోడ్లపై, డ్రెయినేజీల్లో, ఖాళీ స్థలాల్లో చెత్త వేయకూడదని, ఒకవేళ వేస్తే జరిమానాలు విధించాలని కమిషనర్ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో సీఎంహెచ్‌ఓ రాజారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంపత్‌రెడ్డి, జవాన్లు పాల్గొన్నారు.

చట్టంపై అవగాహన తప్పనిసరి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే

కాజీపేట అర్బన్: ప్రతి ఒక్కరూ వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన తప్పనిసరిగా పెంపొందించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే తెలిపారు. హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని సఖి వన్‌స్టాప్ సెంటర్‌లో శనివారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే హాజరై మాట్లాడారు. వినియోగదారులు కొన్న వస్తువులు నాణ్యతగా లేకపోయినా, కల్తీ జరిగినా.. డబ్బులు చెల్లించి పొందే సేవల్లో లోపాలున్నా.. వినియోగదారుల పరిష్కార కమిషన్ ద్వారా పరిహారం పొందే అవకాశం ఉందన్నారు. వస్తువుల కొనుగోలులో మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వినియోగదారులు వస్తువులను కొనుగోలు చేసి నష్టపోయినప్పుడు నేషనల్ కన్జ్యూమర్ హెల్ప్‌లైన్ 1915కు లేదా 88000 01915కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని, బీఐఎస్-కేర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఐఎస్ఐ మార్క్ ఉన్న వస్తువులను కొనుగోలు చేయాలని వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు డాక్టర్ పల్లెపాడు దామోదర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారి జయంతి, సఖిసెంటర్ అడ్మిన్ హైమావతి, సీడీపీఓ విశ్వజ, ఇందిర, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల్లో 359 మంది గైర్హాజరు

విద్యారణ్యపురి: ఇంటర్ సెకండియర్ పరీక్షల్లో శనివారం 359 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈఓ ఎ.గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్, ఒకేషనల్ కోర్సులు కలిపి 17,277 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వాల్సి ఉండగా.. వారిలో 16,918 మంది హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు.

బడ్జెట్ అంచనాల్లో ఆలస్యమెందుకు?

వింగ్ అధికారులపై మేయర్, కమిషనర్ల అసహనం



సమీక్షిస్తున్న మేయర్ సుధారాణి, పక్కన కమిషనర్ అశ్విని

వరంగల్ అర్బన్: ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ఆమోదానికి గడువు దగ్గర పడింది. అంచనాల తయారీలో ఎందుకు అలక్ష్యం ప్రదర్శిస్తున్నారని మేయర్ గుండు సుధారాణి వింగ్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'హద్దు పద్దు లేదు' కథనానికి స్పందించిన మేయర్, కమిషనర్ వింగ్ అధికారులతో శనివారం సమావేశమై 2025-26 ఆర్థిక సంవత్సరం సమగ్ర సమాచారంతో బడ్జెట్‌కు రూపకల్పన చేయాలని హెచ్చరించారు. గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. బడ్జెట్‌కు సంబంధించి వివిధ విభాగాల వారు ఏవైనా మార్పులు చేర్పులు ఉంటే కమిషనర్‌కు సూచించాలని తద్వారా బడ్జెట్ సమగ్రంగా ఆమోదయోగ్యంగా ఉండేలా రూపకల్పన చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్ఓ రాజారెడ్డి, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్ఓ శంకర్ లింగం, సెక్రటరీ అలివేలు, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, జేఏఓ సరిత, హెచ్ఓలు రమేశ్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

మొక్కల పెంపకానికి షెడ్లు ఏర్పాటు చేయాలి..

మొక్కల పెంపకానికి వీలుగా నర్సరీల్లో అదనపు షెడ్లు ఏర్పాటు చేయాలని మేయర్ గుండు సుధారాణి హార్టికల్చర్ అధికారులను ఆదేశించారు. శనివారం బాలసముద్రంలో బల్దియా నిర్వహిస్తున్న రెండు నర్సరీలను మేయర్ క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఏర్పాట్లపై అధికారులకు సూచనలిచ్చారు.

టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ ఎన్నికలకు నోటిఫికేషన్

- ఈనెల 20 వరకు నామినేషన్ల ప్రక్రియ
- 28న ఓటింగ్..

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ ఎన్నికలకు యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి టి. మనోహర్ శనివారం నోటిఫికేషన్ జారీచేశారు. ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీ, జాయింట్ సెక్రటరీలు, ఆర్గనైజేషన్ -1, ఆర్గనైజేషన్ -2 (ఉమెన్), రిక్రియేషన్ పదవులకు ఒక్కో పదవికి నోటిఫికేషన్ ఇచ్చారు. మూడేళ్ల పదవి కాలానికి ఈ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 20వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. అనంతరం స్క్రూటినీ చేసి ఈనెల 21న నామినేషన్ల వివరాలు వెల్లడిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఈనెల 22న మధ్యాహ్నం 3గంటల వరకు ఉంటుంది. తుదిగా అభ్యర్థుల జాబితా 22న సాయంత్రం 4. 30 గంటలకు వెల్లడిస్తారు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులకు 24న గుర్తులు కేటాయిస్తారు. ఓటింగ్ ప్రక్రియ 28న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు క్యాంపస్‌లోని యూనివర్సిటీ కాలేజీలో ఉంటుంది. 29న సాయంత్రం ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడిస్తారు. కాగా, ఈ ఎన్నికల నోటిఫికేషన్‌తో కేయూ టెక్నికల్ స్టాఫ్ ఎంప్లాయీస్‌లో ఎన్నికల సందడి మొదలైంది.

యూట్యూబ్ విలేకరిపై కేసు

ఖిలా వరంగల్: నిజ నిర్ధారణ లేకుండా ఫొటోలతో సహా సామాజిక మధ్యమాల్లో ఓ కథనం పోస్టు చేసిన ఓ యూట్యూబ్ విలేకరిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు. ఓ యువతి విషయంలో పూర్తి సమాచారం లేకుండా.. కనీసం నిబంధనలు పాటించకుండా సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన క్లిప్పింగ్స్ ఆధారంగా సదరు విలేకరిపై శుక్రవారం రాత్రి కేసు నమోదైంది. శనివారం అతడిని పోలీసులు స్టేషన్‌లో విచారించినట్లు సమాచారం.

సీకేఎంలో ఫెర్టిలిటీ ఓపీ సేవలు షురూ



ఓపీ విభాగంలో చికిత్సలు అందిస్తున్న డాక్టర్ షర్మిల

ఎంజీఎం: వరంగల్ సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో శనివారం ఫెర్టిలిటీ ఓపీ సేవలను సూపరింటెండెంట్ షర్మిల ప్రారంభించారు. ప్రస్తుతం అందిస్తున్న గర్భిణులకు సేవలతో పాటు సంతాన భాగ్యం లేని దంపతులకు మరింత మెరుగైన ఓపీ వైద్యసేవలందించేందుకు ప్రత్యేక ఓపీ విభాగాన్ని ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో ప్రత్యేక ఓపీ ప్రారంభించి ఔషధాలు సైతం ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. ఈసేవలు ప్రతీ రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. సంతాన లేమితో ఇబ్బందులు పడుతున్న దంపతులు.. ఈ విభాగంలో నమోదు చేసుకుని ఉచిత వైద్యసేవలు పొందొచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎంఓలు మురళి, సత్యజిత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభల తరలింపులో ఉద్రిక్తత..

- భారీగా తరలిరావడంతో గిర్నిబావిలో ట్రాఫిక్ జామ్
- నిలువరించే ప్రయత్నంలో పోలీసుల లాఠీచార్జ్
- పరుగులు తీసిన బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు
- ఐదుగురికి గాయాలు, బీఆర్ఎస్ ఆందోళన
- డీసీపీ అంకిత్ రాకతో పరిస్థితి అదుపులోకి..



గిర్నిబావిలో ట్రాఫిక్ జామ్

సాక్షి, వరంగల్/దుగ్గొండి: వరంగల్ జిల్లా గీసుకొండ మండలం కొమ్మాల జాతరకు రాజకీయ ప్రభలు (బండ్లు) తరలుతుండగా దుగ్గొండి మండలం గిర్నిబావిలో ఉద్రిక్త పరిస్థితులు ఎదురయ్యాయి. ఒక్కసారిగా తరలిరావడంతో నిలువరించే ప్రయత్నంలో పోలీసులు లాఠీకి పని చెప్పారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ క్రమంలోనే ప్రభల ఎదుట పేలుస్తున్న షార్ట్ బాణాసంచా బోర్లా పడడంతో రోడ్డు పక్కల వారికి తగిలి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో బాంబుల పేలుడు శబ్దం వినిపించడంతో ఫైరింగ్ జరుగుతుందని భ్రమపడిన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, వామపక్షాల కార్యకర్తలు పరుగులు తీశారు. దీంతో పరిస్థితి అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు లాఠీచార్జ్ చేయగా పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు గాయపడ్డారు. ఒకానొక దశలో ఈ ఉద్రిక్త పరిస్థితిని అదుపు చేయడానికి పోలీసులు వాటర్ కేనన్ ప్రయోగించబోయారు. ఏసీపీ కిరణ్‌కుమార్ తన ఏకే 47 గన్ లోడ్ చేసి ఫైర్ చేస్తానని బెదిరించే ప్రయత్నం చేశారు. అనంతరం డీసీపీ అంకిత్‌కుమార్ ఘటనా స్థలికి చేరుకోవడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.జాతరకు స్వయంగా వాహనాలు, ప్రభలను పంపించారు. కాగా లాఠీచార్జ్ బాధితులు ఆందోళన నిర్వహించగా నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అండగా నిలిచి ధర్నాలో పాల్గొన్నారు. సీఐ సాయిరమణ సర్ది చెప్పే ప్రయత్నం చేయగా పోలీసుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు.



లాఠీచార్జ్ బాధితుల ఆందోళనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



ఫైర్ చేస్తానంటూ ఏకే. 47 గన్ గురిపెట్టిన నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్

గిర్నిబావి వద్ద కాల్పులు జరగలేదు

కొమ్మాల జాతర సందర్భంగా గిర్నిబావి ప్రాంతంలో ప్రభ బండ్లు వరుస క్రమంలో తరలివెళ్లే సమయంలో కొందరు అత్యుత్సాహం ప్రదర్శించడంతోపాటు అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసుల ఆదేశాలను పాటించకుండా ముందుకెళ్లే క్రమంలో పోలీసులకు ప్రభబండ్లను తరలించే వారి మధ్య తోపులాట మాత్రమే జరిగిందని వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. అంతేకాని ఈ ఘటనలో ఎలాంటి పోలీస్ కాల్పులు జరగలేదన్నారు. కొన్ని ప్రచార మాధ్యమాల్లో ఈ ఘటనలో కాల్పులు జరిగినట్లు తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రజలకు ఆందోళన కలిగించే రీతిలో ఎవరైనా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు అప్‌లోడ్ చేసినా, వార్తలు రాసిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

కష్టార్జితం.. పోతుందని..

- తనఖా పెట్టిన ఇంటిని అమ్మిన బ్యాంకు అధికారులు
- కొన్న వ్యక్తికి అప్పగించేందుకు రాగా అడ్డుకున్న కుటుంబ సభ్యులు
- ఇల్లు పోతుందని ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న వైనం
- నలుగురికి తీవ్రగాయాలు.. వరంగల్ నగరంలో ఘటన

వరంగల్ చౌరస్తా : తమ కష్టార్జితాన్ని బ్యాంక్ అధికారులు ఇతరులకు అడ్డగోలుగా విక్రయిస్తున్నారంటూ ఓ కుటుంబం పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలు కాగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన వరంగల్ ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జేపీఎన్ రోడ్డులో శనివారం జరిగింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. చెల్లుపూరి హేమ్ కుమార్, ఆనంద్ కుమార్ అనే సోదరులు వ్యాపార అవసరాల నిమిత్తం జేపీఎన్ రోడ్‌లోని తమ ఇంటిని తనఖా పెట్టి యూనియన్ బ్యాంక్ కాజీపేట బ్రాంచ్ నుంచి సుమారు కోటికి పైగా రుణం తీసుకున్నారు. వీరినుంచి బ్యాంకు లావాదేవీలు నిలిచిపోవడంతోపాటు రుణం గడువు ముగియడంతో బ్యాంక్ అధికారులు తనఖాలో ఉన్న ఇంటిని సంపత్ కుమార్ అనే వ్యక్తికి వేలంలో అమ్మకం జరిపారు. అమ్మకం జరిపిన ఆస్తిని సంపత్ కుమార్‌కు అప్పగించడం కోసం బ్యాంక్ అధికారులు శనివారం సంబంధిత భవనం వద్దకు చేరుకోగా, హేమ్ కుమార్, ఆనంద్ కుమార్‌ల కుటుంబ సభ్యులు వారిని అడ్డుకున్నారు. తమ ఆస్తిని ఇతరులకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ వారు ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. స్థానికులు అప్రమత్తమై మంటలను ఆర్పి వేశారు. ఈ ఘటనలో ఆనంద్ కుమార్ (60), తేజశ్రీ (35) హేమ్ కుమార్ కోడలు ప్రశాంతి(32), ఆనంద్ కుమార్ అల్లుడికి తీవ్రగాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు పలు కోణాల్లో విచారణ చేస్తున్నారు. బాధితులు మాత్రం తమ కష్టార్జితం అడ్డగోలుగా అమ్మకానికి పెట్టడం వల్ల తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్యకు యత్నించినట్లు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ విషయమై బ్యాంకు అధికారులు మాట్లాడుతూ నిర్ణీతసమయంలో రుణం చెల్లించకపోవడంతో నిబంధనలు ప్రకారం వేలం వేశామని తెలిపారు.



మంటల్లో బాధితులు

సీపీని కలిసిన కలెక్టర్ సత్యశారద



సీపీకి మొక్క అందజేస్తున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్: వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సన్‌ప్రీత్‌సింగ్‌ను వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కాశీబుగ్గ సెంటర్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ డీఆర్‌ఓ ఎం.విజయలక్ష్మి అన్నారు. జిల్లాలోని ప్రత్యేక అవసరాల పిల్లలకు వరంగల్ శంభునిపేట పాఠశాలలో ఆలింకో కంపెనీ సహకారంతో శనివారం ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ సమగ్రశిక్ష ద్వారా ఉచిత ఉపకరణాలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సమగ్రశిక్ష కోఆర్డినేటర్ కుడికాల సుభాష్, కార్పొరేటర్ పోశాల పద్మస్వామి, ఖిలా వరంగల్ ఎంఈఓ బి.ప్రసాద్, స్థానిక పాఠశాల హెచ్ఎం శారదాబాయి, ఉన్నత పాఠశాల హెచ్ఎం ప్రకాశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'స్టేషన్' అభివృద్ధికి రూ.800 కోట్లు

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- సీఎం సభాస్థలిని పరిశీలించిన ఎమ్మెల్యే, ఎంపీ, సీపీ, కలెక్టర్

స్టేషన్‌ఘన్‌పూర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టితో పలు అభివృద్ధి పనులకు రూ.800 కోట్లు మంజూరు చేశారని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని శివునిపల్లిలో వ్యవసాయ మార్కెట్ సమీపాన ఆదివారం నిర్వహించనున్న సీఎం బహిరంగ సభా స్థలిని ఎంపీ కడియం కావ్య, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్‌తో కలిసి శనివారం పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలకు అనుగుణంగా నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్‌లో చేరానని, కేవలం పది నెలల్లోనే సీఎం రేవంత్ దృష్టికి సమస్యలు తీసుకెళ్లి అభివృద్ధి పనులకు రూ.800 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నేడు శంకుస్థాపన చేసిన వెంటనే పనులను ప్రారంభించి 18 నెలల్లోనే పూర్తి చేయిస్తామన్నారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసిన సీఎంకు కృతజ్ఞతగా నేడు 50వేల మందితో 'కృతజ్ఞత సభ' నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

రాష్ట్రంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న సీఎం రేవంత్ : ఎంపీ కావ్య

రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. ప్రధానంగా వరంగల్ అభివృద్ధికి ప్రత్యేక చొరవతో పనిచేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గానికి లేని విధంగా స్టేషన్‌ఘన్‌పూర్‌కు ఏడాదిలోనే రూ.800 కోట్లు మంజూరు చేశారన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం, ఎంపీ కావ్య

సభావేదికను పరిశీలించిన సీపీ..

సీఎం సభాస్థలి, సభావేదికను వరంగల్ సీపీ సన్‌ప్రీత్‌సింగ్ పరిశీలించారు. సభాస్థలి వద్ద ఏర్పాట్లు, బందోబస్తు, పార్కింగ్, ట్రాఫిక్ తదితర అంశాలపై డీసీపీతో మాట్లాడారు. సీఎం సభ కోసం 800 మంది పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆయన వెంట డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏసీపీలు భీమ్‌శర్మ, అంబటి నర్సయ్య, సీఐలు జి.వేణు, శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సైలు వినయ్‌కుమార్, శ్రావణ్, ఆర్డీఓ డీఎస్ వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు బెలిదె వెంకన్న, సీహెచ్.నరేందర్‌రెడ్డి, జూలుకుంట్ల శిరీశ్‌రెడ్డి, అన్నం బ్రహ్మారెడ్డి, బూర్ల శంకర్, నాగరబోయిన శ్రీరాములు, నీల గట్టయ్య, అంబటి కిషన్‌రాజ్, నీల శ్రీధర్, నీల వెంకటేశ్వర్లు, రాములు, పోశాల క్రిష్ణమూర్తి, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి సభను అడ్డుకుంటాం

- మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: ఎన్నికల ముందు పలు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఆ హామీలను అమలు చేయకుండా నిరంకుశ పాలన సాగిస్తున్నారని, నేడు ఘన్‌పూర్‌లో నిర్వహించనున్న సీఎం 'కృతజ్ఞత సభ' అడ్డుకుంటామని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. అసెంబ్లీలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని అక్రమంగా సస్పెండ్ చేశారని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం అంబేడ్కర్ సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ జగదీశ్‌రెడ్డి అసెంబ్లీలో కేవలం ఆరు నిమిషాలు మాత్రమే మాట్లాడారని, రైతుల సమస్యలపై ప్రశ్నించిన జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడం అమానుషమన్నారు. ప్రశ్నించే గొంతులను నొక్కుతూ నియంతపాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయకుండా పార్టీలు మారిన వారిని రాళ్లతో కొట్టాలని గతంలో చెప్పిన రేవంత్‌రెడ్డి.. ప్రస్తుతం కడియం శ్రీహరి నిర్వహించే సభకు ఎలా వస్తున్నారని ప్రశ్నించారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ శ్రేణుల కష్టంతో ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి దొడ్డిదారిన స్వార్థ ప్రయోజనాల కోసం కాంగ్రెస్‌లో చేరారని ఎద్దేవా చేశారు. కడియంకు ధైర్యం ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి సభకు వెళ్లాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మారపాక రవి, ఆకుల కుమార్, మాచర్ల గణేశ్, తాటికొండ సురేశ్, కుంభం కుమార్, బంగ్లా శ్రీను, మునిగెల రాజు, మారెపల్లి ప్రసాద్, గుండె మల్లేశ్, గుర్రం శంకర్, శ్రీను, గాదె రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్

- టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ

నయీంనగర్: రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులకు కచ్చితంగా అక్రిడిటేషన్ కార్డులు దక్కేలా తమ సంఘం కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ భరోసా ఇచ్చారు. శనివారం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి అధ్యక్షతన హనుమకొండ, వరంగల్ జిల్లాల కార్యవర్గ సమావేశంలో విరాహత్ అలీ మాట్లాడారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్ల విషయంలో కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మొద్దన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో సీనియర్ పాత్రికేయులతో కూడిన కమిటీ నాలుగైదుసార్లు సమావేశమై కొత్త నిబంధనలు రూపొందించిందని, ఈ నేపథ్యంలో అక్రిడిటేషన్ల జారీలో జాప్యమైందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల ఆరోగ్య పథకం, ఇళ్ల స్థలాలు ఇవ్వాలనే డిమాండ్‌తో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) పోరాడుతోందన్నారు. ఇటీవల ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రులకు విన్నవించామని, ప్రభుత్వ ఉద్యోగులతో సంబంధం లేకుండా ప్రత్యేకంగా జేహెచ్ఎస్ ప్రారంభించాలని కోరగా వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంనారాయణ, ఉపాధ్యక్షుడు గాడిపెల్లి మధు, వరంగల్, హనుమకొండ జిల్లాల బాధ్యులు ఎ.రాంచందర్, తోట సుధాకర్, దుర్గా ప్రసాద్, సీనియర్ నాయకులు దాసరి కృష్ణారెడ్డి, కంకణాల సంతోశ్, పి.వేణుమాధవ్, గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విరాహత్ అలీ

బీఆర్ఎస్ ప్రభుత్వంలో క్రీడలు నిర్లక్ష్యం

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్ : బీఆర్ఎస్ ప్రభుత్వం క్రీడలను నిర్లక్ష్యం చేస్తే, స్వయంగా క్రీడాకారుడైన సీఎం రేవంత్‌రెడ్డి క్రీడల అభ్యున్నతికి నిధులు కేటాయిస్తున్నారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర 10వ టెన్నికాయిట్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీల ప్రారంభానికి ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సీఎం కప్ క్రీడాపోటీలు ఘనంగా నిర్వహించి రాష్ట్ర వ్యాప్తంగా క్రీడాకారుల్లో నూతనోత్తేజం తీసుకొచ్చామన్నారు. క్రీడల అభివృద్ధి, క్రీడాకారుల సంక్షేమం కోసం తామెప్పుడు ముందుంటామన్నారు. టెన్నికాయిట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పీఎస్. వెంకటేశ్ మాట్లాడుతూ నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తున్న పోటీల్లో రాష్ట్రం నుంచి 300 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఒలింపిక్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండి. అజీజ్‌ఖాన్, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, శాట్ కోచ్ సద్గురు, టెన్నికాయిట్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ బీఆర్ అంబేడ్కర్, హనుమకొండ, వరంగల్ జిల్లాల కార్యదర్శులు అలువాల రాజ్‌కుమార్, గోకారపు శ్యాంకుమార్, కోశాధికారి జాహూర్, టెక్నికల్ అఫిషియల్స్ వై. సురేందర్, సలహాదారులు కె. జితేందర్‌నాథ్, జి. రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హక్కులపై అవగాహన కల్పించాలి

- వరంగల్ కలెక్టర్ సత్యశారద

వరంగల్: వినియోగదారుల హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం జరిగిన ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవంలో ఆమె మాట్లాడారు. స్థిరమైన జీవనశైలికి ఒక సరైన పరివర్తన అనే అంశంపై వినియోగదారులను చైతన్య పరిచేందుకు 2025 సంవత్సరాన్ని ఐక్యరాజ్యసమితి ఎంపిక చేసిందన్నారు. ప్రపంచీకరణ, పారిశ్రామికరణతో వచ్చిన సమస్యలను అధిగమిస్తే సుస్థిర జీవితం సాగించవచ్చని పేర్కొన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి కిష్టయ్య, జిల్లా జాతీయ కమిషన్ సభ్యులు నరసింహారావు, జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, ఎంవీఐ శోభన్ బాబు, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ గౌతమ్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాముల తనిఖీ

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌యార్డులోని జిల్లా వేర్‌హౌస్ గోదాముల్లో భద్రపర్చిన ఈవీఎంలను వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద.. అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో శనివారం తనిఖీ చేశారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూం గోదాంల రికార్డులు, కట్టుదిట్టమైన భద్రతా చర్యలు, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ గురించి కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

31 నాటికి క్రమబద్ధీకరించుకోవాలి

ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సత్యశారద కోరారు. డీసీసీబీ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్లు, టౌన్‌ప్లానర్లు, లేఅవుట్ రైటర్లు, బిల్డర్లతో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడారు. ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారు ఈనెలాఖరు నాటికి డబ్బులు చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, జీడబ్ల్యూఎంసీ సీపీ రవీందర్ రాడేకర్, అదనపు కమిషనర్ జోనా పాల్గొన్నారు.

ఉద్యాన పంటల వైపు మొగ్గు చూపాలి

- ఉద్యాన శాఖ వరంగల్ జిల్లా అధికారి సంగీత లక్ష్మి

మామునూరు: రైతులు సంప్రదాయ పంటలు కాకుండా ఉద్యాన పంటల వైపు మొగ్గు చూపాలని ఉద్యాన శాఖ వరంగల్ జిల్లా అధికారి సంగీత లక్ష్మి సూచించారు. మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రధాన శాస్త్రవేత్త రాజన్న ఆధ్వర్యంలో సుగంధ ద్రవ్యాల సంస్థ వరంగల్ సౌజన్యంతో సుగంధ ద్రవ్యాల సాగుపై మూడు రోజులుగా జరుగుతున్న శిక్షణ శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై రైతులకు పసుపు, మిరప, కూరగాయల విత్తనాలు పంపిణీ చేసి మాట్లాడారు. ఉద్యాన పంటల సాగును పంట మార్పిడిగా ఉపయోగించాలని, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం వస్తుందన్నారు. అంతకు ముందు సుగంధ ద్రవ్యాల పంట సాగు విధానాలపై శిక్షణ పొందిన రైతులకు ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సౌమ్య, రాజు, నాగరాజు, వేణుగోపాల్, హర్షరెడ్డి, సాయిచంద్, సుశ్రాత్, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు పసుపు, మిరప విత్తనాలు అందజేస్తున్న ఉద్యాన శాఖ అధికారి సంగీతలక్ష్మి

24 నుంచి దూర విద్య డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్య డిగ్రీ బీఏ, బీకాం జనరల్, బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ, బీబీఏ కోర్సుల మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈనెల 24వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి పద్మజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24, 26, 28, ఏప్రిల్ 2, 4, 7 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని వారు తెలిపారు.

పన్ను వసూళ్లలో వేగం పెంచండి

వరంగల్ అర్బన్: పన్ను వసూళ్లలో వేగం పెంచాలని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. శనివారం డిప్యూటీ కమిషనర్లు పన్నుల అధికారితో పన్ను వసూళ్ల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నెలాఖరులోగా లక్ష్యాన్ని ఛేదించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి, రవీందర్, పన్నుల అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఐటీ మేనేజర్ రమేశ్ మొబైల్ ఫోన్‌లో చాటింగ్ చేస్తుండడంతో కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

అధునాతన సాంకేతికతతో సేవలు

హన్మకొండ: అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకుని వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందిస్తున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.గౌతంరెడ్డి తెలిపారు. అసెట్ మ్యాపింగ్ ట్రాకింగ్‌లో అన్ని 33 కేవీ, 11 కేవీ స్తంభాలకు యూనిక్ పోల్ నంబర్ పెయింటింగ్ ప్రక్రియ చేపట్టినట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటి వరకు 33 కేవీ పోల్ నంబరింగ్ పూర్తి అయ్యిందని, 11 కేవీ పోల్ నంబరింగ్ 173 ఫీడర్లు పూర్తి చేశామని వివరించారు.